క్లుప్తంగా...

నేడు ఉచిత వైద్య శిబిరం

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కౌన్సిలర్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. కాలనీవాసులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

జవహర్‌నగర్: రాష్ట్రంలో గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రతినిధులు అన్నారు. శనివారం తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి మొమోరాండం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనులకు గిరిజన బంధు ఇస్తానని చెప్పి ఇవ్వలేదని, వెంటనే ప్రకటించి అమలు చేయాలన్నారు. పోడు రైతులకు శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. తండాల గ్రామపంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా మార్చాలన్నారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు. దర్శనం యాదగిరి, తోటపల్లి కిషన్, ఎల్లయ్య, రవినాయక్, స్వరూప ఉన్నారు.

10 రోజుల పాటు రైల్వేగేటు మూసివేత

ఘట్‌కేసర్: మరమ్మతుల కారణంలో ఘట్‌కేసర్ పట్టణంలోని రైల్వేగేటును 10 రోజులు పాటు మూసి వేయనున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ అధికారి తెలిపారు. రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేస్తుండటంతో ఈనెల 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు రైల్వేగేటు మూసివేస్తామని ప్రయాణికులు సహకరించాలని కోరారు.

చోరీకి యత్నించిన దొంగకు దేహశుద్ధి

మేడ్చల్‌రూరల్: ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ మహిళ మెడలోంచి బంగారం చైన్ చోరీ చేసేందుకు యత్నించిన దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీలో కళ్యాణి ఇంట్లో ఒంటరిగా ఉండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంటి తలుపులు వేసి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీ చేసేందుకు యత్నించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు దొంగను స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు దొంగను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితుడు రాహుల్(21) వరంగల్ జిల్లా నుంచి జీవనోపాధి కోసం మేడ్చల్‌కు వలస వచ్చి గిర్మాపూర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ సహకారంతో యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్ పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శనివారం ముగిసింది. కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఎఫ్‌డీపీలో నేర్చుకున్న హ్యూమన్ వాల్యూస్‌ని కళాశాలలోనే కాకుండా సమాజంలో సైతం ఉపయోగించాలని కోరారు. ఏఐసీటీఈ టెక్నికల్ విషయాలతో పాటు హ్యూమన్ వాల్యూస్‌పై ఫోకస్ చేయడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలత, కళాశాల డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ఫ్యాకల్టీ రిసోర్స్ పర్సన్ కో ఆర్డినేటర్ ఉమేశ్, గీత, శ్రీనివాస్, జగదీశ్, ఏఓ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై విద్యార్థులకు అవగాహన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల, బాసురేగడిలోని హితం కళాశాలల్లో శనివారం అధికారులు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాములు, జిల్లా డీఆర్‌డీఏ అధికారులు యాదయ్య, లత పాల్గొని విద్యార్థులకు ఓటు అనే ఆయుధం విలువైందని వివరించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. రెండు రోజుల ఓటరు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ రజిత, బీఎల్‌ఓలు లింగప్రసాద్, సుజాత, శశిధర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, విజయ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు నీడ కల్పించడమే.. ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- అహ్మద్‌గూడలో 'డబుల్' ఇళ్ల కేటాయింపు

కీసర: అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి అర్హులైన నిరుపేదలందరికీ నీడ కల్పిస్తోందని, ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి ఆలోచనతో పారదర్శకంగా కేటాయిస్తున్నారని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దమ్మాయిగూడ మున్సిపల్ అహ్మద్‌గూడలో శనివారం ముషీరాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజవర్గాలకు చెందిన 1500 మంది లబ్ధిదారులకు మంత్రి మల్లారెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో అలాట్మెంట్ సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన పేదలకు అన్ని వసతులతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి పేదలకు అందజేస్తున్నట్లు, ఇంత గొప్ప పథకం దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. సీఎం కేసీఆర్ కల సాకారమైన రోజు ఎంతగొప్ప రోజు అన్నారు. ఎలాంటి పైరవీలు, రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నట్లు, ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించామన్నారు. మిగిలిన అర్హత కలిగిన వారందరికీ రెండు, మూడు, నాల్గో విడతల్లో ఇళ్ల పంపిణీ చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు.

గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు..

ప్రస్తుతం లబ్ధిదారులకు అందజేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు అన్ని వసతులతో కూడుకున్నవని, లబ్ధిదారులు తమ వీలునుబట్టి గృహ ప్రవేశాలు చేసుకోవాలన్నారు. పేదలపై ఒక్క రూపాయి భారం లేకుండా అన్ని వసతులతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కొత్తగా గృహలక్ష్మి పథకం కింద ఇల్లు కట్టుకునే వారికి రూ.3 లక్షల ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ టీహబ్ తీసుకువచ్చి ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, ఒక్క హైదరాబాద్‌లోనే ఐటీ రంగంలో 9 లక్షల మంది ఉద్యోగస్తులు పనిచేస్తుండటమే ఇందుకు నిదర్శనం అన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జవహర్‌నగర్ మేయర్ కావ్య, ఆర్డీవో రాజేష్‌కుమార్, వివిధ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐదు దశల్లో పట్టాలను అందజేస్తాం

డిప్యూటీ స్పీకర్ పద్మారావు



ప్రతాపసింగారంలో పట్టా అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: ఇల్లు లేని పేదల కోసం సీఎం కేసీఆర్ రెండు పడకల ఇళ్లను నిర్మించి అందజేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావు అన్నారు. ప్రతాపసింగారంలో శనివారం జరిగిన సమావేశంలో డ్రా ద్వారా లబ్ధిదారులకు అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, సర్పంచ్ శివశంకర్‌తో కలిసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇల్లు రాలేదని ఎవరూ నిరాశ చెందవద్దని, ఐదు దశల్లో ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తామన్నారు.

ఇంజినీరింగ్ విద్య విలువైంది



సీఎంఆర్‌సెట్ ఓరియంటేషన్ డేలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్య ఎంతో విలువైందని, విద్యార్థులు నాలుగేళ్లు అన్నింటికీ దూరంగా ఉండి మంచి ఉత్తీర్ణత శాతంతో, ఉద్యోగంతో కళాశాల నుంచి బయటకు వెళ్లాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల ఓరియంటేషన్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మొదటి సంవత్సరం ఇంజినీరింగ్‌లో అడుగు పెడుతున్న విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థులు బీటెక్‌లో చేరగానే తాము స్వేచ్ఛా జీవులమని భావించి చెడు అలవాట్లకు గురికావొద్దని అన్నారు. ప్రణాళిక, లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారాలని, అప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, శ్రీశైలంరెడ్డి భూపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌తో ఉజ్వల భవిష్యత్తు



సాయిసతీశ్‌తో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్: వైద్యరంగంలో ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్‌కు ప్రస్తుతం అధిక ప్రాముఖ్యత సంతరించుకుందని ఇండియన్ సర్వర్స్ సీఈఓ సాయిసతీశ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ(ఏయూ)లో సీఎస్‌ఈ విభాగం, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజినీరింగో రీసెర్చ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల హ్యాకథాన్ శనివారం ప్రారంభించారు. సీఈఓ మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ, వైద్యంలో ఆర్టిఫిషల్ ఇంటిలిజన్స్ అత్యంత సహాయకారిగా ఉపయోగపడుతుందని, విద్యార్థులు ఈ రంగంలో నిష్ణాతులైతే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. డీన్ విష్ణుమూర్తి, సమన్వయకర్త శైలజ, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, వేధరెడ్డి పాల్గొన్నారు.

ఎంఆర్‌ఈఎంలో ఘనంగా స్నాతకోత్సవం



పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ ఎంఆర్‌ఈఎం కళాశాలలో శనివారం స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ పట్టభద్రులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. పట్టాలు పొందిన పట్టభద్రులతో తమ నైపుణ్యాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. తమ కళాశాల నుంచి ఏటా నాణ్యమైన ఇంజినీర్లను సమాజానికి అందిస్తున్నామని కళాశాల చైర్మన్ వేముల మల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ జగిత్యాల వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు, హెచ్‌ఆర్ లీడర్ శైలజ, కళాశాల కార్యదర్శి కృష్ణారెడ్డి, డైరెక్టర్లు భరతసింహరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, రెక్టార్ కల్నల్ నరేందర్‌రెడ్డి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న భవానీనగర్‌కు చెందిన వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు

కీసర: బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నేతలు, నాయకులు పెద్దఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి వారికి బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్‌చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కౌకుట్ల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కార్తీక్‌గౌడ్, రాములు, హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ సంతోష్‌నగర్‌లో కాలనీవాసుల సొంత నిధులు, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సహకారంతో శనివారం డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని, మంత్రి మల్లారెడ్డి సహకారంతోనే జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రజల సహకారంతో ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి రెడ్డిశెట్టి మహేష్, నాయకులు శ్రీమన్, మల్లారెడ్డి, నర్సింహ, మనోజ్, రజిత, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

వజ్రేష్‌యాదవ్



మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ నేతలు పనిచేయాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఓబీసీ డిక్లరేషన్ కమిటీ కో-చైర్మన్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఓటరు లిస్టుపై ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ప్రాంతంలోని బోగస్ ఓట్లను గుర్తించి క్రాస్ ఓటింగ్ జరగకుండా చూడటంతో పాటు నిజమైన ఓట్లను గుర్తించి క్రాస్ ఓటింగ్ జరగకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరితవెంకటేష్, నాయకులు బాలరాజుగౌడ్, సదానంద్, రాజుయాదవ్, అనంతలక్ష్మి, వేణు, ఆనంద్, రాజుయాదవ్, పాషామియా, సుమన్, శ్రీను, రజితగోపాల్, సుగుణ, లత, వినయ్, విజయ, లక్ష్మి, సరిత, సునీత, అజయ్, సోమేష్, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

శామీర్‌పేట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థులను శనివారం ఎంపిక చేశారు. శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేటలో జోనల్ సెక్రెటరీ సత్తిరెడ్డి సమక్షంలో ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేశామని, అండర్-14, అండర్-17 విభాగాల్లో జిల్లాస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి శామీర్‌పేట జోనల్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకురావాలన్నారు. పీఈటీలు వెంకట నారాయణ, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్‌కు నివాళి

మహానేత, ఆంధ్రప్రదేశ్ సీఎం దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం పెద్దఎత్తున ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్ ప్రజల గుండెల్లో కలకాలం పదిలంగా నిలిచి ఉంటారని అన్నారు.



నాగారంలో..



బాసిరేగడిలో నివాళులర్పిస్తున్న నాయకులు, మహిళలు



మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద వైఎస్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



జవహర్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ నేతలు



దేవరయాంజాలో వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఘనాపూర్‌లో నివాళులర్పిస్తున్న మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి

గురుకుల్ వ్యవస్థాపకుడు బన్సీలాల్ వ్యాస్‌జీ వర్ధంతి



ఘట్‌కేసర్‌లో బన్సీలాల్ వ్యాస్‌జీ వర్ధంతి సందర్భంగా యువకుల బైక్ ర్యాలీ

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పట్టణంలో గురుకుల్ వ్యవస్థాపకుడు ఆచార్య బన్సీలాల్ వ్యాస్‌జీ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు చేతబూని బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం గురుకుల్ యజ్ఞశాలలో బన్సీలాల్ వ్యాస్‌జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ నైజాం కాలంలోనే వందలాది ఎకరాల భూమిని గురుకుల్‌కు కేటాయించి దక్షిణ భారతంలోనే గురుకుల్‌ను మణిదీపంగా తీర్చిదిద్దారని ఆయన అందించిన సేవలు గుర్తుచేసుకున్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: అవుషాపూర్ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి దంపతులు ఆ గ్రామానికి చెందిన పేద యువతి కృష్ణగౌడ్ కూతురు వివాహానికి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి రూ.5 వేలను పెళ్లి కూతురు, తల్లిదండ్రులకు అందజేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీ కండువాలు కప్పుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ యువకులు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎల్లంపేట బీఆర్‌ఎస్ నాయకుల నేతృత్వంలో మంత్రి ఇంటికి వెళ్లగా ఆయన పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఉపసర్పంచ్ గోప గణేష్, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, నాయకులు రామకృష్ణుడు, ఎస్‌ఆర్‌కె తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల పంపిణీలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు, స్థానికులు

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడలో శనివారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ సందర్భంగా మంత్రి మల్లారెడ్డికి బీజేపీ నేతలు, స్థానికుల నుంచి నిరసన సెగ తగిలింది. అహ్మద్‌గూడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నగరంలోని మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజవర్గాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి వేదికపై మాట్లాడుతుండగా దమ్మాయిగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. కొంతమందిని పోలీసులు అరెస్టు చేసి కీసర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.